క్లుప్తంగా

యూటీఎఫ్ కార్యవర్గానికి అభినందనలు




జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన రవిబాబు, అజయ్‌కుమార్

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన నూతన పల్నాడు జిల్లా కార్యవర్గంలో నూజెండ్ల మండల ఉపాధ్యాయులు ఎం. రవిబాబు జిల్లా కోశాధికారిగా, ఆర్.అజయ్ కుమార్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో వారికి అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నూజెండ్ల మండల గౌరవాధ్యక్షులు డి.కోటేశ్వరరావు, అధ్యక్షులు సి.హెచ్.మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యప్రకాశరావు, జిల్లా కౌన్సిలర్లు రామిరెడ్డి, అచ్యుత్‌కుమార్ అభినందించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (వినుకొండ) ఆధ్వర్యంలో ఈపూరులోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కృష్ణకాంత్ గార్లపాటి మాట్లాడుతూ బీపీ, ఈసీజీ, షుగర్, స్త్రీలకు సంబంధించిన స్కానింగ్ పరీక్షలు ఉచితంగా అందించామన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు, హైస్కూల్ హెచ్ఎం రామకృష్ణారెడ్డి, డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, డాక్టర్ పొన్నగంటి మహేష్, డాక్టర్ కొరివిపాడు అభిషేక్, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ నందూరి హరికృష్ణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన లింగంగుంట్ల రింగ్‌రోడ్డులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని యల్లమంద గ్రామానికి చెందిన సకిల సాకేత్‌రెడ్డి(22) ఇద్దరు స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై రింగ్‌రోడ్డు నుంచి లింగంగుంట్లకు వస్తున్నారు. సున్నపుబట్టీల సెంటర్‌కు సమీపంలో స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించకపోవడంతో వేగంగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సాకేత్‌రెడ్డి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇరువురికి గాయాలయ్యాయి. వీరిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్ తెలిపాడు.

17న పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలిఅర్బన్: జాతీయ పెన్షనర్స్ డేను పురస్కరించుకుని ఈనెల 17న పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి పిఎల్‌జీ సూర్యప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని పెన్షనర్స్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఆడిట్ రిపోర్ట్ ఆమోదం, 75 సంవత్సరాలు నిండిన సభ్యులకు సన్మాన కార్యక్రమం వంటివి జరుగుతాయని చెప్పారు. సభ్యులందరు పాల్గొనాలని కోరారు.

రబీకు ఫెంగెల్ మేలు



నాదెండ్ల: ఫెంగెల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రబీ సాగుదారులకు మేలు చేకూరింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి చివరి దశకు చేరాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తిని తొలగించి పొగాకు, శనగ సాగు చేశారు. ఆదివారం 4.2 సెంమీ, సోమవారం 4.5 సెంమీ వర్షం కురవటంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శనగ సాగు చేసేందుకు ఎంతగానో ప్రయోజనం కలిగిందంటున్నారు. పొగాకు, మిర్చి సాగుదారులకు వర్షం ఊరటనిచ్చింది. ప్రస్తుతం మిర్చి సాగు చేసి నెల రోజులు గడుస్తున్నా బెట్టతో అల్లాడుతున్న మొక్కలకు తాజా వర్షం జీవం పోసింది. దీంతో రైతులు కాంప్లెక్స్ ఎరువులు చల్లేందుకు సిద్ధమౌతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ వివరణ కోరగా, పత్తి సాగు చివరి దశకు చేరిందని, కొన్ని గ్రామాల్లో రైతులు పత్తిని పీకి రబీ సాగుకు సిద్ధమౌతున్నారన్నారు. పొగాకు ధర గతేడాది క్వింటాకు రూ.14–16 వేలు ఉండటంతో ఈ ఏడాది రైతు లు సాగును పెంచారు. శనగ కూడా ప్రభుత్వ మద్దతు ధరకు సమానంగా మార్కెట్లో ధరలు పలకటంతో శనగ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

విలీనంతో మెరుగైన వసతులు

- ఆస్తుల విలువల్లో పెరుగుదల
- గణపవరంలో పెరిగిన జీవన ప్రమాణాలు



గణపవరంలోని సచివాలయ భవనం

నాదెండ్ల: మున్సిపాలిటీల్లో గ్రామాలు విలీనమైతే పట్టణాల స్థాయిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందటమే కాక, ప్రజల ఆస్తుల విలువ, జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మున్సిపాలిటీలకు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని 2004కు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. ఈ మేరకు గణపవరం గ్రామ పంచాయతీని చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేయాలని అప్పటి పాలక వర్గ సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. 2004లో ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో విలీన ప్రక్రియను బలపరిచారు. ఈ క్రమంలో 2019లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియను వేగవంతం చేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ గెజిట్ నోటిఫికేషన్‌లో మేజర్ పంచాయతీలైన గణపవరం, పసుమర్రు గ్రామాలతో పాటూ మానుకొండవారిపాలెం గ్రామాన్ని చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. 1958లో గణపవరం గ్రామ పంచాయతీగా ఏర్పడింది. రెండు దశాబ్దాల అనంతరం గణపవరం గ్రామంలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కావటంతో జనాభా, ఆదాయం పెరిగి మేజర్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం గ్రామంలో 25 వేల జనాభా నివశిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో నిధులు మంజూరవుతాయని, దీంతో గ్రామంలో వసతులు మెరుగౌతాయని ప్రజలు ఆశించారు. 2019 డిసెంబర్‌లో మున్సిపాలిటీలో విలీన గ్రామాలను కలుపుకునేందుకు మున్సిపల్ కమీషనర్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020 మార్చిలో ఎన్నికల కమిషన్ గణపవరంలో ఐదు మున్సిపల్ వార్డులను ఏర్పాటు చేసి ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2021 మార్చి 10న మున్సిపల్ ఎన్నికలు జరగ్గా, నాలుగు స్థానాల్లో వైఎస్సార్ సీపీ, ఒక స్థానంలో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాలకు హాజరౌతూ గణపవరం సమస్యలను ప్రస్తావిస్తున్నారు.

విలీన ప్రక్రియను నిలిపివేయాలంటూ కేసు

గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన కొద్ది నెలలకు విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలంటూ పసుమర్రు, గణపవరం గ్రామాలకు చెందిన ఇరువురు రాష్ట్ర హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీంతో విలీన ప్రక్రియపై న్యాయస్థానం స్టేటస్ కో విధించింది. అప్పటి నుంచి గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ నుంచి గానీ, మున్సిపాలిటీ నుంచి గానీ నిధులు విడుదల కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో తీవ్ర సమస్యలు నెలకొని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.36 కోట్లు వెనుక్కు...

చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమైన మూడు గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరిచేందుకు అమృత్ పథకం క్రింద రూ.36 కోట్లు నిధులు మంజూరు చేసింది. జనాభా ప్రాతిపదికన గణపవరానికి రూ.16.5 కోట్లు చెందుతాయి. అయితే హైకోర్టులో స్టేటస్ కో కారణంగా నిధులు మంజూరు నిలిచిపోయింది. అంతేకాక 14, 15 ఆర్థిక సంఘం నిధులు సైతం నిలిచిపోయాయి. దీంతో తాగునీటి వ్యవస్థ ఆధునికీకీరణ ఆగిపోయింది. అంతేకాక పంచాయతీ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. విలీన ప్రక్రియ రద్దయితే గ్రామ పంచాయతీకి కూటమి ప్రభుత్వం నుంచి అవసరమైన మేరకు నిధులు మంజూరౌతాయా అనే సందేహం ప్రజలను వేధిస్తున్నది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గణపవరం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం నిలిపివేసి పంచాయతీగానే కొనసాగించాలంటూ తీర్మానం చేశారు. ఈ తీర్మానంపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 2019లో ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్, ఆ తర్వాత ఉన్నత న్యాయస్థానంలో స్టేటస్‌కో ఉన్నందున గ్రామ తీర్మానం చేసేందుకు అధికారం ఉన్నదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

విలీనానికే ప్రజల మొగ్గు

మున్సిపాలిటీలో విలీనమైతే గ్రామం అభివృద్ధి చెందుతుందని, ఆస్తుల విలువలు పెరుగుతాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధులతో మౌలిక వసతులు పుంజుకుంటాయని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. విలీనానికే మెజార్టీ ప్రజలు మొగ్గుచూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకోనుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ములుగు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

ప్రజా సంఘాల నాయకులు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: తెలంగాణా రాష్ట్రం ములుగు జిల్లాలో జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో పోస్టర్లను ప్రదర్శించి మీడియాతో మాట్లాడారు. ఒకటవ తేదీ ఉదయం తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు తెలంగాణ పోలీసులు ప్రకటించారని అన్నారు. దీనిపై ఆ రాష్ట్ర పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాలు అనేక అనుమానాలు వ్యక్తం చేసి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించాలని తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారన్నారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో విచారణ జరిపించి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వరుసగా జరిగే ఎన్కౌంటర్లను ఆపేయాలని, మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ప్రజలకి ప్రజాస్వామిక హక్కులు, స్వేచ్ఛను కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, నల్లపాటి రామారావు, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథక నిర్మాణం ప్రారంభించండి

ప్రభుత్వాన్ని కోరిన ఏపీ రైతు సంఘ నాయకులు



మాట్లాడుతున్న రైతుసంఘు నాయకులు

నరసరావుపేట: జిల్లాలో నకరికల్లు వద్ద నిర్మించాల్సిన ఎత్తిపోతల పథక నిర్మాణం చేపట్టి నాగార్జునసాగర్ కుడికాలువ ప్రవహించే మూడు జిల్లాలైన పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని పదిలక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందజేయాలని ఏపీ రైతుసంఘ పల్నాడు జిల్లా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కోవెలపూడి రాము మాట్లాడుతూ కృష్ణా, గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేసి హరిశ్చంద్రాపురం నుంచి 80 కిలోమీటర్ల మేర కాలువ, పైపులైను వేసి నకరికల్లు వద్ద ఎత్తిపోతలను ఏర్పాటు చేసి సాగర్ కుడికాలువలో నీటిని ఎత్తిపోసే పథకాన్ని 2017లో శంకుస్థాపన చేశారన్నారు. దీనికి కావల్సిన బడ్జెట్‌ను కూడా కొంత కేటాయించారన్నారు. ఇది అమలైతే మూడు జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని అన్నారు. కృష్ణా డెల్టాకు ఏమాదిరిగా నీటి లభ్యత ఉంటుందో అదేవిధంగా కుడి కాలువ పరిధిలోని రైతాంగానికి నీటి వసతి ఏర్పడుతుందన్నారు. దీని వలన కరువు అనేది ఉండదన్నారు. అందువలన ఈ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుదలను విరమించుకోవాలి

సీపీఐ డిమాండ్



ఆందోళన చేస్తున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రజలపై భారం మోపుతూ కూటమి ప్రభుత్వం తలపెట్టిన విద్యుత్ చార్జీల పెంపుదలను వెంటనే విరమించుకోవాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను బిగించాలనుకోవడం దారుణమన్నారు. అరండల్ పేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు భారం కలిగేలా చార్జీలను పెంపుదల చేయటం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంపబోమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.15 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రజలపై భారం మోపుతూ చార్జీలను పెంచుతున్నారని విమర్శించారు. సమావేశం అనంతరం విద్యుత్ చార్జీల పెంపుదల నిరసిస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, స్టేషన్ రోడ్డులో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి కాసా రాంబాబు, బోదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, కోలా స్వాతి, సి.హెచ్.నిర్మల, వైదన వెంకట్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వెళ్లిరావమ్మా... పోలమ్మా!

ఘనంగా పోలీ స్వర్గ పూజ



కోనేరులో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొత్తపేట సురేష్ మహల్ రోడ్డులోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం ఆవరణలో కార్తిక మాస సమారాధనలో భాగంగా గత నెల రోజుల నుంచి ఆలయంలో విశేషమైన పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున పోలీస్వర్గ పూజలను మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సీనియర్ న్యాయవాది సీహెచ్. మూర్తి మాట్లాడుతూ సర్వకుల, సర్వమత ఐక్యతను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు, కళాకారులు, న్యాయవాదులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సద్గురు షిరిడీ సాయిబాబా దేవాలయంలో...

పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని శ్రీ సమర్థ సద్గురు షిరిడీ సాయిబాబా దేవాలయంలో కార్తిక మాసం సందర్భంగా సోమవారం 30 అడుగుల వెడల్పుతో పోలీస్వర్గం కోనేరు ఏర్పాటు చేసి మధ్యలో ఉత్సవ శివలింగాన్ని ప్రతిష్ఠించి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అరటి బోదెలతో ఒక్కొక్క ఒత్తులు ఏర్పాటు చేసి దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసులు శాస్త్రి మాట్లాడుతూ ఈ పోలీ స్వర్గం కోనేరు చరిత్ర ఈ కార్యక్రమంలో తెలుపుతూ జ్యోతులతో కోనేరులోని శివదర్శనం చేసుకొని మహిళా భక్తులు దంపతులు జన్మతరింప చేసుకున్నారన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

•పింఛన్లు నిలిపేశారయ్యా!



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పింఛనుదారులు

మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన పింఛనుదారులు తమకు ఈనెల పింఛను నిలిపివేయడంపై ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యకు సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అర్హత కల్గియున్న మాలాంటి పేదల పింఛను ఎందుకు నిలిపివేశారో తెలియదని వారు వాపోయారు. వితంతు, వికలాంగులు, వృద్ధాప్య పింఛన్లు 11 మంది లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలన్నారు. దీనిపై ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ అర్హత కల్గియున్న వారి పింఛన్లు విచారణ చేసి సత్వరమే న్యాయం చేస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సర్పంచ్ తన్నీరు అంకారావు, వైఎస్సార్ సీపీ మండల కో ఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు ఉన్నారు. –శావల్యాపురం

తమిళనాడులో తప్పిపోయాడు!

- నరసరావుపేటకు చేరాడు
- మతిస్థిమితం లేని వ్యక్తిని క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



తవమణిని తండ్రికి అప్పగిస్తున్న రూరల్ ఎస్ఐ కిశోర్

నరసరావుపేట రూరల్: మతిస్థిమితం లేని తమిళనాడుకు చెందిన యువకుడిని రూరల్ పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. కేసానుపల్లి పరిధిలోని లలితాదేవి కాలనీలో ఆదివారం సాయంత్రం విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీసులకు గుర్తుతెలియని యువకుడు తారసపడ్డాడు. పోలీసులు యువకుడిని విచారించగా వివరాలు కూడా సక్రమంగా వెల్లడించలేదు. యువకుడు మాట్లాడుతున్న భాష ఆధారంగా తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

అతని ద్వారా కుటుంబసభ్యుల ఫోన్ నెంబర్ తెలుసుకున్న పోలీసులు వారికి సమాచారం అందించారు. సోమవారం యువకుడి తండ్రి లోకనాధం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐ కిశోర్ వారిని విచారించి వివరాలు సేకరించారు. యువకుడు పేరు తవమని అని, 20 రోజుల క్రితం తిరువల్లూరు హాస్పిటల్‌కు వైద్యం కోసం తీసుకెళ్లగా అక్కడి నుంచి కనిపించకుండా పోయాడని లోకనాధం పోలీసులకు తెలిపాడు. యువకుడి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించినట్టు వివరించారు. తమ కుమారుడిని తమకు అప్పగించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశాడు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.



పంట నేలవాలింది!

మండలంలోని అన్ని గ్రామాల్లో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు సోమవారం కూడా కొనసాగాయి. ఉదయం నుంచి అప్పడప్పుడు చిరు జల్లులు పడుతుండగా సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ వర్షానికి సంతగుడిపాడు గ్రామ పరిధిలో సాగు చేస్తున్న వరి పొలాలు అక్కడక్కడ నేలవారాయి. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులను చూస్తే వర్షాలు కొనసాగే అవకాశం ఉందని మాగాణి రైతులు ఆందోళన చెందుతున్నారు. –రొంపిచర్ల

క్రీస్తు జననం లోకానికి వెలుగు

ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ డా.ప్రతాప్ సింహాకొమానపల్లి



క్రిస్మస్ కేక్‌ను కట్ చేసిన ప్రతినిధులు

చిలకలూరిపేటటౌన్: క్రీస్తు జననం లోకానికి వెలుగు అని ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ డా.ప్రతాప్ సింహాకొమానపల్లి సందేశం అందించారు. పట్టణంలోని యేసు క్రీస్తు దివ్యశాంతి నిలయంలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీపాస్టర్స్ ఫెలో షిప్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పాస్టర్ నందమూరి క్రిష్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాల్లోని పాస్టర్లు హాజరయ్యారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా. డేనియల్‌పాల్, గుంటూరు జోనల్ చైర్మన్ డా ఎంఎస్ విక్రాంత్‌వర్ధన్, పల్నాడు జిల్లా సలహాదారులు సుధీర్‌కుమార్, జనరల్ సెక్రెటరీ బిషప్ డా. జె.జయరావు పాల్గొని దేవుని వ్యాక్య పరిచర్యల చేశారు.

సెలవు బకాయిలు వెంటనే చెల్లించాలి



చిలకలూరిపేట: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సెలవు బకాయిలు వెంటనే చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జల్లెడ రాజశేఖర్ కోరారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిడ్కో గృహ సముదాయం సమీపంలోని విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్య ధోరణివల్ల దీక్షలకు దిగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తీరా కార్మికులు ఉద్యమానికి దిగాక ఆరేళ్లగా బకాయిలు రావాల్సి ఉంటే ఒక్క ఏడాది బకాయిలు చెల్లిస్తామని ప్రకటించటం సరికాదన్నారు. ఆన్‌లైన్ సమస్యలు చూపి ఐదేళ్ల బకాయిలు జమ చేయక పోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు సీహెచ్ అయ్యప్ప, జి రాంబాబు, కె.బాలగౌతమ్, షేక్ అబ్దుల్ సలాం, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వినుకొండ: నూజెండ్ల మండలంలో రవ్వారం సమీపంలో కొండ వెనుక ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడిచేసినట్లు ఐనవోలు పోలీసులు తెలిపారు. ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,03,500 నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, తొమ్మిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముగిసిన కార్తిక మాసం వేడుకలు



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, మతుకుమల్లి, పొట్లూరు, శావల్యాపురం, గంటావారిపాలెం, కారుమంచి, తదితర గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.